క్లుప్తంగా

నేడు ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరం

మోతీనగర్: లయన్స్ క్లబ్ ఆఫ్ బంజారా హిల్స్ శాఖ, జెన్‌నెక్స్ట్ పాఠశాల ఆధ్వర్యంలో శనివారం గాయత్రినగర్‌లోని పాఠశాల ఆవరణలో ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు కేల వెంకటరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3:30 గంటల వరకు విద్యార్థులతో పాటు పరిసర ప్రాంత వాసులు అందరూ ఈ ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

సమస్యల పరిష్కారానికి కృషి



సమస్యలను కార్పొరేటర్ సబిహాబేగంకు వివరిస్తున్న మహిళలు

మోతీనగర్: శ్రీవివేకానందనగర్ కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబిహాబేగం అన్నారు. సంక్షేమ సంఘం సభ్యులు వార్డు కార్యాలయంలో కార్పొరేటర్‌ను కలిసి వివిధ సమస్యలు వివరించారు. మంచినీటి సరఫరా సరైన సమయానికి రావటం లేదని, లో ప్రెషర్‌తో సరిపడా నీరు రావడం లేదన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. పేరుకుపోయిన చెత్తాచెదారాలను తొలగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. వీధి లైట్లు మరమ్మతులు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

డిప్యూటీ కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలిపిన నేతలు

కూకట్‌పల్లి: ఇటీవల కూకట్‌పల్లి సర్కిల్ నూతన డిప్యూటీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన గంగాధర్‌ను శుక్రవారం టీపీసీసీ లేబర్ సెల్ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి కర్క నాగరాజు సత్కరించారు. కార్యక్రమంలో కుతాడి కృష్ణ, వెంకటపతి, నాగార్జున, పోలేపల్లి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నిస్తే కేసులు నమోదు చేస్తారా?

ఆల్విన్‌కాలనీ: ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్నందుకే బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కేసులు నమోదు చేస్తున్నారని మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీల మీద ఎప్పుడైనా రివ్యూ మీటింగ్ పెట్టిన దాఖలాలు లేవన్నారు. కేటీఆర్‌ను ఏ విధంగానైనా జైలులో వేయాలని పగటి కలలు కంటున్నారని అన్నారు. ప్రభుత్వ విధానాలను ప్రజలు గమనిస్తున్నారని, గుణపాఠం తప్పదని ఆయన హెచ్చరించారు.

ఘనంగా గ్యార్వీ షరీఫ్ ఉత్సవాలు



ఉత్సవాల్లో పాల్గొన్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్, జగదీశ్వర్ గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: డివిజన్ పరిధి శంషీగూడలోని ఈద్గాలో నిర్వహించిన గ్యార్వీ షరీఫ్ ఉత్సవాల్లో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్‌తో శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్ శుక్రవారం పాల్గొన్నారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కూన సత్యం గౌడ్, కావూరి ప్రసాద్, వాసు, నవీన్ రెడ్డి, లక్ష్మీ నారాయణ, నవాజ్, కైజర్, సయ్యద్, రెహ్మాన్, సుల్తాన్, అబ్దుల్, ఖలీల్, ముస్తఫా, షఫీ, సోయల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు చేరువలో ప్రభుత్వ వైద్య సేవలు



సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందేలా జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర నాయక్ సూచించారు. శుక్రవారం నగరంలో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి(డీఎంహెచ్‌ఓ) డా. రఘునాథ్‌స్వామి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ డాక్టర్ రవీంద్రనాయక్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు మంచి సేవలను అందించటంలో మేడ్చల్ జిల్లా ముందంజలో ఉందని, ఈ ఒరవడిని కొనసాగించాలని అభినందించారు. డైరెక్టర్‌గా ఏడాది కాలాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న డాక్టర్ రవీంద్రనాయక్‌ను డీఎంహెచ్‌ఓ సన్మానించారు.

వెలగని లైట్లు.. తప్పని ఇక్కట్లు

- మూసాపేట, బాలాజీనగర్ డివిజన్‌లో చీకట్లోనే రాకపోకలు



ఆంజనేయ నగర్‌లో చీకటిగా ఉన్న రహదారి

మూసాపేట: మూసాపేట, బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలు అంధకారంలో కొట్టుమిట్టాడుతున్నాయి. సాయంత్రం ఆరు దాటిందంటే చిమ్మ చీకట్లతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యుత్ స్తంభాలు ఉన్నా లైట్లు వెలగడం లేదు. కొన్ని నెలల నుంచి సమస్య ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు. స్టాక్ లేదని చెబుతూ అధికారులు చేతులు దులుపుకుంటున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయంలో మెట్రో స్టేషన్ నుంచి ఇంటికి వెళ్లాలంటే భయపడాల్సి వస్తోంది. అంజయ్య నగర్, జనతా నగర్, వడ్డెర బస్తీ, యాదవబస్తీ, వార్డు కార్యాలయం సమీపంలో పలు ప్రాంతాల్లో నిత్యం విద్యుత్ లైట్లు వెలగక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు మరమ్మతులు చేసి వెలుగులు ఇచ్చేలా కృషి చేయాలని కోరుతున్నారు.



పాపనాశేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే దారిలో..



శివాలయం, సాయిబాబా మందిరానికి వెళ్లే దారిలో..

> **మరమ్మతులు చేస్తాం**
>
> విద్యుత్ లైట్లు వెలగడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి. అవకాశం ఉన్న మేరకు వెంటనే స్పందించి మరమ్మతులు చేస్తున్నాం. బుధవారం వరకు ప్రధాన సమస్యలుగా ఉన్న ప్రాంతాల్లో మరమ్మతులు చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేస్తాం.
>
> – స్వప్న, మున్సిపల్ ఎలక్ట్రికల్ అధికారి

హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ల సమస్యలు పరిష్కరించాలి



సాక్షి, సిటీబ్యూరో: సంక్షేమ హాస్టళ్లలో అమలవుతున్న నూతన డైట్ విధానం (కామన్ మెనూ) అమలుతో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లకు ఎదురవుతున్న క్షేత్ర స్థాయి సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ గౌతమ్‌కు టీఎన్‌జీవోస్ జిల్లా కమిటీ కోరింది. ఈ మేరకు శుక్రవారం హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లకు ఎదురవుతున్న సమస్యలు, ఇబ్బందులపై ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బి.రవిప్రకాష్ అధ్వర్యంలో ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ గౌతమ్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చినట్లు టీఎన్‌జీవోస్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో టీఎన్‌జీవోస్ జిల్లా కార్యదర్శి భరత్ కుమార్, నాయకులు రజిని, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ల కేంద్ర, జిల్లా ఫోరం నాయకులు పాండు, సుధాకర్‌రెడ్డి, మద్దూరి మాణిక్యం, కమల్ దాస్ పాల్గొన్నారు.

‘శాంటా మారియా’కు ఉత్తమ డెలిగేషన్ అవార్డు



అవార్డు అందుకుంటున్న శాంటామారియా స్కూల్ విద్యార్థులు

చందానగర్: శేరిలింగంపల్లిలోని శాంటామారియా ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ డెలిగేషన్ అవార్డు గెలుచుకున్నారు. ఇటీవల మలేషియాలోని కౌలాలంపూర్‌లో 10 బి ఇంటర్నేషనల్ స్కూల్, సెటియా ఎకో పార్కులో నిర్వహించిన మొదటి ఇంటర్నేషనల్ స్కూల్స్ పార్టనర్‌షిప్ మోడల్ యునైటెడ్ నేషన్ (ఐఎస్పీఎంయూఎన్)లో ప్రతిష్ఠాత్మకమైన డెలిగేషన్ అవార్డు గెలుచుకున్నారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపల్ హేమలత సంజయ్ మాట్లాడుతూ ఈ ఈవెంట్‌లో సాంస్కృతిక మార్పిడి, ఆలోచనాత్మక సహకారంపై చర్చలు జరిగాయన్నారు. ప్రపంచ సమస్యలపై చర్చించడానికి, సాంస్కృతిక సంబంధాలను మెరుగుపరచడానికి ఇంటర్నేషనల్ స్కూల్స్ పార్టనర్‌షిప్ మోడల్ యునైటెడ్ నేషన్స్ మలేషియా–2024 విద్యార్థులకు ఒక వేదికను అందించిందన్నారు. ఈ గ్రాండ్ ఈవెంట్‌లో 70కి పైగా ఇంటర్నేషనల్ స్కూల్ పార్టనర్‌షిప్ స్కూళ్లకు చెందిన 250 మంది విద్యార్థులు హాజరయ్యారు.

నాలాలో వ్యక్తి మృతదేహం లభ్యం



సుభాష్‌నగర్: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం వెంకట్రామ్‌నగర్‌లోని ఓ హాస్టల్ సమీపంలో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉందని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించగా అతడి ప్యాంట్ జేబులో డ్రైవింగ్ లైసెన్స్ లభించింది. అందులో అతడి పేరు లింగయ్య అని, ఇంటి నంబరు 8–47/1, గాజులరామారం సంజయ్‌గాంధీనగర్ అని ఉందని పోలీసులు తెలిపారు. మృతుడి సంబంధీకులు ఉంటే స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టమ్ నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

గో సంరక్షణ పాదయాత్రకు ఘన స్వాగతం



స్వాగతం పలుకుతున్న కార్పొరేటర్ సతీష్ గౌడ్, అయ్యప్ప స్వాములు

బాలానగర్: బాలకృష్ణ గురు స్వామి ఆధ్వర్యంలో కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు చేస్తున్నటువంటి గో సంరక్షణ పాద యాత్ర శుక్రవారం ఫతేనగర్‌కు చేరింది. ఫతేనగర్ అయ్యప్ప సేవా సమితిలోని స్వాములు జైశ్వాల్ బేకరీ వద్ద ఘన స్వాగతం పలికి బాలకృష్ణ గురుస్వామిని సన్మానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్, మూర్తి, ఉపేందర్, సోమేశ్, సుధీర్, శేఖర్, నరేంద్ర, బాలరాజు, విజయ్, రవి తదితరులు పాల్గొన్నారు.

పునరుద్ధరణీయ ఇంధన వనరులతో పరిశ్రమల మనుగడ

తెలంగాణ రెడ్ కో మేనేజింగ్ డైరెక్టర్ వావిళ్ల అనీల



పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న వావిళ్ల అనీల

రంగారెడ్డినగర్: పునరుద్ధరణీయ ఇంధన వనరులతోనే భవిష్యత్‌లో పరిశ్రమలు మనుగడ సాగిస్తాయని తెలంగాణ రెడ్ కో మేనేజింగ్ డైరెక్టర్ వావిళ్ల అనీల అన్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ గాంధీనగర్‌లోని స్మార్ట్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం జాతీయ విద్యుత్ సహజ వనరుల పరిరక్షణ వారోత్సవాలు నిర్వహించారు. గాంధీనగర్ ఐలా పారిశ్రామికవేత్తల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన అనీల మాట్లాడుతూ పారిశ్రామికవేత్తలు నాణ్యమైన విద్యుత్ పరికరాలనే వాడాలని, ప్రతి పారిశ్రామికవేత్త పునరుద్ధరణీయ ఇంధన వనరుల ఆధారిత విద్యుత్ వాడకాన్ని చేపడితే విద్యుత్ ఆదా అవుతుందన్నారు. పునరుద్ధరణీయ ఇంధన వనరుల ఆధారితతో కొనసాగే పరిశ్రమల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని, ప్రభుత్వపరంగా అనేక రాయితీలను పొందే ఆస్కారం ఉంటుందని స్పష్టం చేశారు. అనంతరం పలువురు పారిశ్రామికవేత్తలు అనీలకు పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ రెడ్ కో జనరల్ మేనేజర్ వరప్రసాద్, డిప్యూటీ డైరెక్టర్(నేషనల్ ప్రొడక్టివిటీ కౌన్సిల్) పీఆర్.రాజ్‌కమల్, డిప్యూటీ జనరల్ మేనేజర్ రమణ, ప్రాజెక్టు డైరెక్టర్ రాధిక, ఐలా చైర్మన్ పీవీ రాజం, పూర్వ చైర్మన్ ఆర్.శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, గాంధీనగర్ ఇండస్ట్రీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పైడిపల్లి స్వామిగౌడ్ పాల్గొన్నారు.

కబ్జా చేశానని నిరూపిస్తే వారికే ఇచ్చేస్తా

- పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గాంధీ

ఆల్విన్‌కాలనీ: తాను కబ్జా చేసినట్లు నిరూపిస్తే ఆ స్థలాన్ని వారికే ఇచ్చేస్తానని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓ ప్రతికలో తాను కబ్జా చేసినట్లు వచ్చిన కథనం అవాస్తవమని అన్నారు. తనకు నియోజకవర్గ అభివృద్ధి తప్ప మరే అంశంపై దృష్టి పెట్టాల్సిన అవసరం లేదన్నారు. మచ్చలేని మనిషిగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నానని తెలిపారు. తనపై కావాలని బురద చల్లేందుకు ఎవరు ప్రయత్నించినా సహించబోనని అన్నారు. తాను 33 ఏళ్ల క్రితం భూమిని ప్రభుత్వ నిబంధనలకు లోబడి కొనుగోలు చేశానని వివరించారు.

తాగునీటి పైపులైన్ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తదితరులు

మూసాపేట: మూసాపేట డివిజన్ చైతన్య బస్తీలో స్వచ్ఛమైన నీటి సరఫరాకు మోక్షం లభించింది. శుక్రవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కార్పొరేటర్ కొడిచర్ల మహేందర్ తో కలిసి నూతన పైపులైన్ పనులను ప్రారంభించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, డివిజన్ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్, జిల్లా గోపాల్, తుకారాం, విష్ణు, రాజు, అయిలయ్య యాదవ్, శ్రీనివాస్, బాబురావు, వెంకట్‌స్వామి, మంగమ్మ, శ్యామల, హరిత, శాంత, పద్మ, లత తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వాటర్ బిల్లులను చెల్లించాలి



డ్రైవ్‌లో పాల్గొన్న వాటర్ వర్క్స్ మేనేజర్ ప్రశాంతి తదితరులు

ఆల్విన్‌కాలనీ: హైదరాబాద్ వాటర్ వర్క్స్ భాగ్యనగర్ సెక్షన్ పరిధిలో పెండింగ్ వాటర్ బిల్లుల కోసం శుక్రవారం డ్రైవ్ నిర్వహించారు. వన్ టైం సెటిల్‌మెంట్ గడువు నవంబర్ 30వ తేదీన ముగిసినందున వాటర్ బిల్లు వసూళ్ల కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. బిల్లులు చెల్లించని వాణిజ్య, గృహ వినియోగదారులను గుర్తించి వాటర్ కనెక్షన్లు కట్ చేస్తామని మేనేజర్ ప్రశాంతి అన్నారు. పాత బకాయిలు చెల్లించాలని వినియోగదారులను అధికారులు కోరారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు

ఆల్విన్‌కాలనీ: ఎన్‌టీఆర్ నగర్‌లోని బెతేల్ గాస్పల్ చర్చి, ఆల్విన్‌కాలనీ ఫేజ్ 1లోని యునైటెడ్ క్రిస్టియన్ అసోసియేషన్ వారు సెమీ క్రిస్మస్ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పాస్టర్లు, నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.



వేడుకలో పాల్గొన్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, పాస్టర్లు తదితరులు



క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని మోతీనగర్‌లో పలువురు క్రైస్తవులు శుక్రవారం క్రిస్మస్ కలర్స్ కార్యక్రమంలో పాల్గొన్నారు. జరీన్ జాన్ శాంతా క్లాజ్ వేషధారణలో ఆకట్టుకున్నారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేశారు. - మోతీనగర్

హస్త ‘కళ కళ’

ఆకట్టుకుంటున్న అంతర్జాతీయ మేళా








మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ హస్తకళా మేళా ఆకట్టుకుంటోంది. వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులను స్టాల్స్‌లో అందుబాటులో ఉంచారు. బెంగళూరుకి చెందిన కళాకారులు తయారు చేసిన చెక్క విగ్రహాలు, వాల్ హ్యాంగింగ్, జ్యూట్ బ్యాగులు, బొమ్మలు, ఆర్టిఫీషియల్ జువెలరీ, వెదురు బుట్టలు, అద్దకం చీరలు, కలంకారీ, వెంకటగిరి, గద్వాల్, చద్దర్లు, మంగళగిరి నేత చీరలు అందుబాటులో ఉన్నాయి. కొండపల్లి బొమ్మలు, మధ్యప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్ ప్రాంతాలకు చెందిన బ్రాస్ ఆర్ట్‌లు అందుబాటులో ఉన్నాయి. దశావతారాలు, అష్టలక్ష్మీ, గుర్రాలు, వివిధ రకాల గృహాలంకరణ ఉత్పత్తులు ఉన్నాయి. ధర రూ.1000 నుండి రూ. 5.5 లక్షల వరకు అందుబాటులో ఉన్నాయి. ఇక ఆగ్రా కళాకారులు మార్బుల్‌తో టీ ప్లేట్లు, గుర్రాలు, ఏనుగులు, వివిధ రకాల కళాత్మక ఉత్పత్తులను అందుబాటులో ఉంచారు. ఈ ఎగ్జిబిషన్ ఈనెల 31వ తేదీ వరకు కొనసాగనుంది.

ప్రతి రోజూ సాంస్కృతిక కార్యక్రమాలు

మేళాలో భాగంగా ప్రతి రోజు యాంఫి థియేటర్‌లో సాయంత్రం 5 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. భరతనాట్యం, కూచిపూడి, కథక్, సంగీత కచేరీ, ఒడిస్సీ, పేరిణీ నాట్యం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.







ఇండియన్ ఇంజినీరింగ్ కాంగ్రెస్‌లో ‘ఎస్కీ’ స్టాల్

రాయదుర్గం: దేశవ్యాప్తంగా ‘ఎస్కీ’ పనితీరు వివరిస్తామని గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు తెలిపారు. కోల్‌కతాలో శుక్రవారం ప్రారంభమైన 39వ ఇండియన్ ఇంజినీరింగ్ కాంగ్రెస్‌లో ‘ఎస్కీ’ స్టాల్‌ను పశ్చిమబెంగాల్ విద్యుత్ శాఖ మంత్రి అరూప్ బిస్వాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రామేశ్వరరావు ఫోన్‌లో వివరాలు అందజేశారు. జాతీయ స్థాయిలో జరిగే కార్యక్రమాలలో ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేసి ‘ఎస్కీ’లో అందించే శిక్షణ, అందుబాటులోకి తీసుకొచ్చిన పీజీ, అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులు, త్వరలో ప్రారంభించే స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులను వివరించడం జరుగుతుందన్నారు.



‘ఎస్కీ’ స్టాల్ గురించి మంత్రి అరూప్‌బిస్వాస్‌కు వివరిస్తున్న ఎస్కీ డైరెక్టర్ రామేశ్వరరావు